# "ఏరావాకా సాగుమురో"

ఏరువాకా సాగ్లుమురో రన్నో చిన్నన్నా
నీ కష్టమంతా తీరునురో రన్నో రైతన్నా
వలుపల దాపల ఎడ్లగట్టుకొని
నవధాన్యాలను గంపనెత్తుకొని
ముల్లుగర్రను చేతబట్టుకొని
ఇల్లాలిని మరి వెంటబెట్టుకొని
ఏరువాకా సాగుమురో రన్నో చిన్నన్నా
నీ కష్టమంతా తీరునురో రన్నో రైతన్నా...!

ఉగాది పండుగ దగ్గెరికెత్తె నాగ్గిపాట నాలికెమీద తిరుగుతుంటది. నేనెక్కడున్నా బూరెల కనవడ్డా, ఉగాది పచ్చడిని చూసినా ఈ పాట మదిల మెదుల్తనే ఉంటది. నా మనుసంతెక్కడెక్కన్నో తిరుగుతది. నేను కొంచెమంతెదిగినంక సదువకునుటప్పుడు ఉగాదినాడు ఏరువాక సాగుటానికి మా సిన్నాయిన్నతోని మబ్బుల్లేసి పోయింది యాదికత్తది. నా మనుసు గతంల తిరుగుతది.

చిన్నప్పుడు నాకు ఉగాది పండుగత్తంటె చాల సంబురంగుండేది. కొంత కట్టంగ గూడనిపిచ్చేది. శెనిగపప్పుడకవెట్టి బెల్లంతోని సేసిన బూరెలు తినచ్చని సంబురపడెటోన్ని. కాని మబ్బుల్లేసి సాగువాటుకు పోవన్నంటె విసుగనిపిచ్చేది. నేను పుట్టినప్పట్నుంచి కొద్దిగోతీరుగ బతుకున్నమని నేను కొంచెమెదిగినప్పటకెల్లి నన్నే సాగువాటుకు తోలెటోడు మా నాయిన్న. తెల్లారితె పండుగనంగ నన్ను తెల్లారి సుక్క పొడిసినంక లేపెటోడు. మొకం గడుక్కోని జెప్పన పెయ్యి కడుక్కొమనెటోడు. అటెనుక కొత్తబట్టలుంటె కొత్తయి లేకుంటె ఉతికిన బట్టలు తొడుక్కొమనెటోడు. ఆకరు కోతువ్వాలన్న కొత్తదుండేది. మొకానికి బొట్టు పెట్టుకునెటోన్ని. మా చిన్నాయిన్నతోని కల్సి పెరట్లకు సాగువాటుకు పొయ్యెటోన్ని. బుజమ్మీన గొడ్డలివెట్టుకొని మబ్బుల్నే బయిలెల్లెటోల్లం. ఎదురుంగ బాగ పిల్లలుగన్న ఆడామె. ముత్తైదువ లేకుంటె నిండు ముంత ఎదురైతె మంచి శెకునమనెటోల్లం.

గిట్ల మంచి శెకునం జూసుకోని సాగువాటుకు బయిలెల్లెటోల్లం. మబ్బుల్నే పెరట్లున్న చిన్న కొమ్మనన్న. తుప్పనన్న కొట్టెటోల్లం. తూరుపు దిక్కు తిరిగి మొక్కి ఇంటికచ్చెటోల్లం. ఇంటికచ్చెవారకింకా

చీకటె ఉండేటిది. సాగువాటయినోడు మబ్బుల లేసెన్నుంచి రాత్రిదాక నిద్దుర పోవద్దని నాయిన్న సెప్పెటోడు. నిద్రవోతె ఆ యేడు పంట గూడ నిద్రవోయినట్టే ఉంటదనెటోడు. ఇది ఎవుసదార్ల నమ్మకం. గందుకోసురం నాకు కూర్పట్లచ్చినా, కండ్లమీదికి నిదుర కమ్ముకచ్చినా అటీటు తిరుక్కుంట నిద్రనాపుకోవాలచ్చేది. గిది నాకు సాన కట్టంగనిపిచ్చేది. కొద్దిగంత పొద్దెక్కి వారకంట్ల ఒగాది పచ్చడి, బూరెలు గిట్ల తయారయ్యేటియి. అందరం సాయెమాన్ల కూసుండి గవ్వీట్న తినెటోల్లం. గవ్వి తిన్నంక నాగలి గట్టుకోని పొయ్యి పెరట్ల అట్ల రొండు సాల్లు దున్ని వచ్చుటానికి పొయ్యెటోల్లం. ఇగప్పటికెల్లి ఆ యాడాదికి ఎవుసప్పనులు మొదలైనట్టు లెక్క. సిన్నాయిన్న మీదికే ఏరువాక పాట పాడుతంటె నేను నా అండ్ల నేను పాడుకుంట నాలుగు సాల్లు నాగలి దున్నెటోన్ని.

ఇంటికచ్చినంక పొద్దుందనుక నీదురవోకుండుటానికి బాగ తిప్పలయ్యేటిది. ఎండకాలమాయె. మల్ల మబ్బులే లేసుడాయె. కొంచెమన్నట్ల ఒరుగదామనిపిచ్చినా ఒరుగకపోదు. ఇగ నిద్రాపుకుంటానికి బాగ కోశిశ్ సేసెటోన్ని. సదువుతె ఇంకెక్కో నిదురత్తది. సోపతిగాల్లింటికి పండుగనాడు పోతె మంచిగుండదనెటోడు మా నాయిన్న. అందుకోసం బజార్ల అటీటు తిరుక్కుంట, ఆల్లతో నీల్లలోని మాట్లాడుకుంట యాల్ల గడిపెటోన్ని.[94] అట్లనో ఇట్లనో సాయంత్రమయ్యేటిది. సాయింత్రమయిందంటె ఇంకిన్ని బూరెలు తిని అనుమాండ్ల దేవునికాటికి పంచాంగమినుటానికి పొయ్యెటోన్ని. అయ్యగారందర్ని సుట్టు కూసుండవెట్టుకోని ముక్యంగ ఊరి పెద్దలంత వచ్చినంక పంచాంగం సదివెటోడు. ఈ సంవత్సరం రాజు.........మంత్రి.......పశుపాలకుడు..........వర్షాధిపతి.........ధాన్యాధిపతి............అని సదువుతంటె ఊరోల్లంత శ్రెద్దగినెటోల్లు. అటెనుక రాశిఫలాలు సెప్పెటోడయ్యగారు. ఎవ్వలరాశి గురించి సెప్పుతె ఆల్లంత సెవ్వులప్పలిచ్చి[95] ఇనెటోల్లు. రాశులు తెలువనోల్లు పేర్లు, జునుమనామాలు చెప్పి చూడుమనెటోల్లు. ఆదాయంకంటె ఖర్సు ఎక్కువుందని చెప్పుతె మొకం మాడ్చెటోల్లు. ఆదాయమెక్కువ ఉందంటె సంబురపడెటోల్లు. వర్షాల సంవత్సరం మంచిగున్నయంటె సంబురపడెటోల్లు. పశుపాలకుడు శ్రీకృష్ణుడండె కాపుదనపోల్లకు మస్తు ఖుషయ్యేది. పంచాంగం సెప్పుడయిపెయినంక అందరు లేసిపొయ్యెటోల్లు. గాసారం గురించి మాట్లాడుకునెటోల్లు. ఇయ్యేడు వానలు మంచిగ్గొడుతె బాగుండనుకునెటోల్లు. వానదేవుడేం జేత్తడో అని రంధి పడెటోల్లు. నేను కాలేజీ సదువుకు పెయినంక ఏరువాక సాగుడు బందు జేసిన. మా నాయిన్నే పొయ్యెటోడు. పండుగకోపారి వచ్చెటోన్ని. ఇంకోపారి రాపోదు. ఓనాడు పండుగనాడే పగటీలి నన్ను దగ్గెర కూసుండవెట్టుకోని సెప్పిండు సిన్నాయిన్న. గయినె మాటలింటె కాపుదనపోల్లకు బూమి మీదెంత ప్రేముంటదో, గదంటె ఎంత పానమిడుత్తరో తెలుత్తది.

"ఎవుసప్పని సేసెటోనికి బూమంటె సెప్పలేని మనుసుంటది కొడుక. గా మట్టికోసురం

పానమైన ఇడుత్తడు. గా మట్టినే నమ్ముకొని బతుకుతడు. గా మట్టి దయజూపి ఇంతంత పంటిత్తె ఎగిరి గంతేత్తడు. గది దయజూపకుంటె ఏం సెయ్యన్నో సాతగాకేడుత్తడు. మట్టిన్నమ్మే .బొక్కలన్ని కలికలిగాంగ పన్జేసి తనింత తినుకుంట దేశంలున్న జెనాలకింత పంటిత్తడు. అయితె గా మట్టి దయ జూడాలంటె ఎన్నినుకూలం గావాలె?

ఆయుటి సినుక్కోసం వెయ్యి కండ్లతోనెదురుసూత్తడు. సినుకు పడ్డదంటె ఎగిరిగంతేత్తడు. రైతు కండ్లల్ల ఎలుగత్తది. తడిసిన మట్టివాసనం జూసి ముర్సిపోతడు. ఇగ ఎద్దుకో నాగలన్నట్టు పునాస సాగుతడు. ప్రకృతి దయ జూపెనా పర్వలేదు. లేకుంటె గా ఇత్తునం బూమి పాలే ఐతది. గట్లెన్నో సార్లయింది. మొదాలు ఒక్కటి రొండు వానలు పడుడు. బూమిల ఇత్తునం పడ్డంక వానలటే పోవుడు. రైతు ఇత్తునానికి గూడ మునుగుడు.

ఇగ పునాస సాగుడు మొదలువెడితె రైతుకు చస్తామన్న తీరది. ఇంటింటికి రాజు లంతగా పనికే అంకితమైపోతరు. గింతసేసినా కొన్నిసార్ల పెట్టువల్లన్న రాదు. కొన్నిసార్లు అప్పులే మిగుల్తయి. పంట పండనేడు పండకపాయె. పండినేడు ధరుండది. ఏ పంటయితె ఓ తీరుగ పండుతదో గదానికి కస్సలే దరుండధి. అన్నింటికేమొ అగ్గోలె ధరలు. రైతు పంటకేమొ తక్కో ధర. ఎవ్వలు తయారు సేసిన వస్తువు ధరనాల్లే నిర్ణయించుకుంటరు. మరి రైతు పండిచ్చిన పంట ధరనేమొ ఎవ్వలో పెడ్తరు. నాకైతె ప్రకృతికంటె మనిషి మోసకారనిపిత్తంది. కాలం గిట్లనే నడుత్తంది బిడ్డ. రైతుకు రెక్కలు, బొక్కలే మిగుల్తన్నయి. ఎవసం జేసి బంగ్లాలు గట్టిన్ని సూపునాకు"

అచ్చెరం ముక్క గూడ రాని చిన్నాయిన్న మాటలల్ల ఎన్నో నగ్నసత్యాలున్నట్టనిపిచ్చింది నాకు. ఎన్నేండ్లు గడిసినా దేశానికి వెన్నెముకసోంటి రైతు గట్లనే ఉంటండు. ఊల్లెకు పెయినప్పుడెవుసందార్లం జూత్తె కండ్లపొంటి నీల్లత్తయి.

మట్లె మట్టయి పనిజేసే రైతుకు మట్టే మిగుల్తందని బాదపడ్తుంట. వాళ్ళ కట్టానికి తగ్గ ఫలితం దొరుకుతెంత మంచిగుండునని నా అండ్ల నేను మనాది పడుత. గప్పుడే ఒగాది పండుగ నిజమైన పండుగయితది. కని గాకాలం నాకయితె దగ్గెరున్నట్టు కనవడుతలేదు. ఎందుకంటె రోజు రోజు రోజు కెంతోమంది ఎవుసాలిడ్సి పెట్టి ఊళ్ళిడ్సి పోతండ్రు. భూములమ్ముకుంటండ్రు. అందరెవుసాలొదిలిపోతె పంటపండిచ్చేదెవ్వలు? గీ ప్రశ్నే నన్ను బాద పెడ్తుంటది.

☆ ☆ ☆